# 17

# యేసు: అభిషిక్తుడు

మెస్సీయా, అభిషిక్తుడు, (తలపై) తైలము పోయబడినవాడు. కీషు కుమారుడైన సౌలు ఈ విధంగా మెస్సీయా అయ్యాడు (1 సమూ. 10:1). అలాగే, దావీదు కూడా మెస్సీయా అయ్యాడు: "సమూయేలు తైలపు కొమ్మును తీసి వాని సహోదరుల యెదుట వానికి అభిషేకము చేసెను" (1 సమూ. 16:13). ఒకని రాజుగా నియమించే మామూలైన పద్ధతి తైలముతో అభిషేకించడం.

దేవుడు సొంత కుమారునికే మెస్సీయా అనే భావనను ప్రత్యేకమైన కార్యముగా నిలువజేశాడు ప్రభువైన యేసును వర్ణించడానికి ఆయన వినియోగించిన బిరుదులలో ఒకటి మెస్సీయా, ఆయన "అభిషిక్తుడు" (కీర్తన. 2:2). దానియేలు ప్రభువును రాచరికపు వ్యక్తిగా "అభిషిక్తుడగు అధిపతి" అని చిత్రించాడు (దానియేలు 9:25).

*Mashiah* అనే హెబ్రీ పదం "మెస్సీయా" అని తెలుగులోనికి వచ్చింది; దీనికి గ్రీకు సమము, *Christos,* అది "క్రీస్తు"గా మారింది. ప్రభువైన యేసుతో బావి వద్ద మాట్లాడిన సమరయ స్త్రీ, ఎలాగో మొత్తానికి మెస్సీయాగా దైవమే లోకానికి అవతరిస్తాడని ఎరిగింది. "క్రీస్తనబడిన మెస్సీయా వచ్చునని నేనెరుగుదును" అని ఆమె చెప్పింది (యోహాను 4:25).

ఈ లోకానికి అవతరించుటలో దైవము అభిషిక్తుడు, మెస్సీయా అనే బిరుదును ధరిస్తాడని యోహాను శిష్యులలో ఒకడైయుండిన అంద్రెయ కూడా ఎరుగును. "మేము మెస్సీయాను కనుగొంటిమి" అని అతడు పేతురుతో చెప్పినప్పుడు అతని స్వరంలోనుండి లోతైన భావన (ఫీలింగ్) ఉండి ఉండాలి (యోహాను 1:41).

"నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని పేతురు తరువాత ఒప్పుకున్నాడు (మత్తయి 16:16). నజరేయుడే దేవుని అభిషిక్తుడగు కుమారుడనే వాస్తవం మీద సంఘం స్థాపించబడడం దేవుని జ్ఞానంలో సంకల్పించబడిందని ప్రకటిస్తూ, పేతురు యొక్క విశ్వాసాన్ని ఆయన శ్లాఘించాడు. ఏదియెలాగున్నా, అలంకారికంగా మాట్లాడితే, పేతురు తన ఒప్పుకోలును చేసేటప్పుడు, యేసు మెస్సీయా, అభిషిక్తుడు కాడు. ఆయన మరణమును సమాధిని ఓడించి, మహిమలోనికి ఆరోహణమైన తరువాతనే ఆయన దేవునిచేత అభిషేకింపబడ్డాడు. ఆయన ఆరోహణుడైన పది దినాలకు, పట్టాభిషేకం చేయబడడానికి యేసు దేవుని సింహాసనం ఎదుటికి వెళ్లాడు. అలంకారంగా మాట్లాడాలంటే, తన తండ్రి ఆయన తలమీద అభిషేక తైలమును పోశాడనవచ్చు. తండ్రి అలా చేసినప్పుడు యేసును ఆయన "దేవా" అని సంబోధించాడు:

> దేవా, నీ సింహాసనము నిరంతరము నిలుచును నీ రాజదండము న్యాయార్థమైన దండము. నీవు నీతిని ప్రేమించి భక్తిహీనతను ద్వేషించుచున్నావు కావున దేవుడు నీ దేవుడే చెలికాండ్రకంటె హెచ్చుగునట్లుగా నిన్ను ఆనందతైలముతో అభిషేకించి యున్నాడు (కీర్తన. 45:6, 7).

ప్రభువు దినమున జరిగిన ఆ చారిత్రక సమయం మొదలు (క్రీ.శ. 30, మే 26 కావచ్చు), ఆయన రాజులకు రాజుగాను ప్రభువులకు ప్రభువుగాను (1 తిమోతి 6:15), అధికార పూర్వకంగా అభిషేకించబడ్డ అభిషిక్తుడు.